క్లుప్తంగా

వాటర్ ప్యూరిఫయర్ అందజేత



కమలాపూర్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మెకీస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం వాటర్ ప్యూరిఫయర్, వాటర్ కూలర్ అందజేశారు. ప్రభుత్వాస్పత్రికి నిత్యం అనేక మంది రోగులు వస్తుంటారని, వారికి చల్లని మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో తమ సంస్థ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్యూరిఫయర్, వాటర్ కూలర్ అందజేసినట్లు హెచ్‌పీసీఎల్ డీజీఎం మేదూరి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ సురేష్ చంద్, అడ్మినిస్ట్రేషన్ అధికారి పవన్, ఆపరేషన్ అధికారి వంశీ, సేఫ్టీ అధికారి మోహన్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, హెచ్‌పీసీఎల్ ప్లాంట్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్, ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని అంబేడ్కర్ కూడలిని జంక్షన్ చేయాలని, తెలంగాణ అమరుల వీరుల స్తూపాన్ని అదే స్థానంలో ఉంచాలని కోరుతూ కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీఓ రమేష్‌రాథోడ్‌కు దళిత, ప్రజా సంఘాల నాయకులు గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, కండె సుధాకర్, తూముల సదానందం, జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, కవ్వ లక్ష్మారెడ్డి, వెంకటస్వామి, రామచంద్రం తదితరులు ఉన్నారు.

ఒకరి అరెస్ట్

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన పంజా దుర్గరాజు అలియాస్ రాజు అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పల్ గ్రామంలో ఈ నెల 2న రెండు వర్గాలు పరస్పర దాడులు చేసుకోగా ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఒక కేసులో నిందితుడైన రాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు..

పరకాల: పరకాల పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో గల గంగావైన్స్ వెనుకాల పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు. గురువారం పరకాల పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసు వాహనం చూసి పారిపోతున్నవారిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, పేక ముక్కలు, రూ.24,350, 4 సెల్‌ఫోన్లు లభ్యమైనట్లు తెలిపారు. పరకాల పట్టణానికి చెందిన నిందితులు కొమ్ముల పున్నం, కుదాని బజిని సింగ్, మోరె కుమారస్వామి, ఓరుగంటి రజనీకాంత్, వేల్పుల రాంచందర్ అరెస్టు పరకాల కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. మరో ముగ్గురు మడికొండ ప్రవీణ్, దుదాని సురేందర్, ఎం.డీ అలీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, పోలీస్ కానిస్టేబుల్ డి.నాగరాజు, దేవేందర్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని కేయూలో ధర్నా



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ మొదటి గేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నాయకుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు వారం రోజులుగా వివిధ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. నిరసనకు ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, డీఎస్‌యూ నాయకులు గణేష్, తదితరులు సంఘీభావం తెలిపారు.

ముందస్తు అరెస్టులు

రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, యూనివర్సిటీల్లో చేపట్టబోయే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని, జీఓ 21లో సవరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ చలో సెక్రటరియేట్‌కు పిలుపునిచ్చారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున ట్రైసిటీలోని పార్ట్‌టైం లెక్చరర్లను పోలీసులు అరెస్టు చేశారు.

డ్రైయినేజీల నిర్మాణమెన్నడో..?



సైడ్ డ్రైయినేజీ లేకపోవడంతో నిలిచిన మురుగు నీరు





రోడ్డు పైకి చేరిన మురుగునీరు

- మండల కేంద్రంలో డ్రైయినేజీలు లేనివైనం
- రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు
- దోమల స్వైరవిహారం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నడికూడ: నూతన మండలంగా ఏర్పడిన తర్వాత పలు అభివృద్ధి పనులు చేపట్టారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి గొల్లపల్లి వరకు అదనంగా సీడీపీ నిధులతో డివైడర్‌తోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఉండేలా ప్రత్యేక ప్రణాళికలలో భాగంగా 50 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టా రు. ఈ రోడ్డు విస్తరణలో పాత డ్రైయినేజీ వ్యవస్థను పూర్తిగా తొలగించారు. గత ప్రభుత్వం హయాంలోనే డ్రైయినేజీల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేసినప్పటికీ ఎన్నికల వల్ల కార్యరూపం దాల్చలేదు. డ్రైయినేజీ వ్యవస్థ సరిగాలేకపోవడంతో మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు తమ ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వకు గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో దుర్వాసన, దోమలు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలంలోగా పూర్తిస్థాయి సైడ్ డ్రైయినేజీ వ్యవస్థను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సైడ్ డ్రైయినేజీ నిర్మించాలి



మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత డ్రైయినేజీ వ్యవస్థ పూర్తిగా తొలగించారు. మురుగు నీరు వెళ్లేందుకు కాల్వ లేకపోవడంతో మురుగు నీటి నిల్వకు గుంత ఏర్పాటు చేస్తే, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సైడ్ డ్రైయినేజీలు నిర్మించాలి.

– కనకయ్య, నడికూడ

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..



మండల కేంద్రంలో 50 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేయడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సైడ్ డ్రైయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా చేయడం జరిగింది. ఎలక్షన్ వల్ల ఆగిపోయింది. రానున్న వర్షాకాలంలో సైడ్ డ్రైయినేజీ నిర్మిస్తారని ఆశిస్తున్నాం.

– ఊర రవీందర్ రావు, మాజీ సర్పంచ్, నడికూడ

అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న

వేలేరు: సొంత ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని పేదలకే మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలని, అర్హులైన వారినే ఎంపిక చేసి వివరాలను అందజేయాలని అన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులను కలెక్టర్ వెరిఫికేషన్ చేసి మంజూరు పత్రాలను అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, ఎంపీఓ భాస్కర్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు డాక్టర్ రణధీర్ రెడ్డి, రూపావతి తదితరులు పాల్గొన్నారు.

దామెర: అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మండల ప్రత్యేక అధికారి బాలరాజు అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఇదిరమ్మ లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కుటుంబంలో ఒకరినే లబ్ధిదారుగా గుర్తించాలని సూచించారు. ఇల్లు నిర్మించుకునే వారినే ఎంపిక చేయాలన్నారు. మే 2 న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, నాయకులు సదిరం పోశాలు, జక్కుల రవి, భిక్షపతి, రాజేందర్, కట్టయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న

బాధిత కుటుంబానికి పరామర్శ

వేలేరు: వేలేరు మండల కేంద్రానికి చెందిన సంగం నరేష్ అనే యువకుడు ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 50 కేజీల బియ్యం అందజేసి భరోసా కల్పించారు. కార్యక్రమంలో శంకరయ్య, సునీల్, రాజయ్య, బాలకొంరయ్య, సంపత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న యాదగిరి

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బాబు, ఎంఈఓ శ్రీధర్ తదితరులు, ఉపాధ్యాయులు

కమలాపూర్: నాణ్యమైన విద్యాబోధన అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఎంపీడీఓ గుండె బాబు, ఎంఈఓ కె.శ్రీధర్ కోరారు. కమలాపూర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ముద్రించిన 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ కరపత్రాలను గురువారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదుల వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదిగారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ద్వారా విద్య బోధన అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శివప్రసాద్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సీఎస్సార్ మల్లిక్, ఉపాధ్యాయులు సువర్ణ, అరుంధతి, ప్రభావతి, అలుక్ షాలీమా, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నాగేంద్ర, సీఆర్పీ సుభాష్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- వేల్పుల సారంగపాణి

దామెర: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎంపీడీఓ కల్పనకు సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో ఉపాధిహామీ పనులకు ఫీల్డ్ అసిస్టెంట్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగ భద్రత కల్పించి తమను ఆదుకోవాలని కోరారు. జనవరి నుంచి నేటివరకు వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వేడుకున్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు కుమారస్వామి, శంకర్, భిక్షపతి, లింగమూర్తి, శ్రీనివాసులు, వసంత, రాజేశ్వరి, రజిని తదితరులు ఉన్నారు.



ప్రకాశ్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్ఏ లు

ఉద్యోగి బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

- ఎంఈఓ భిక్షపతి

శాయంపేట : ఉద్యోగి బాధ్యతగా పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఎంఈఓ భిక్షపతి అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా ఆయన పాల్గొని వెంకటేశ్వరావు దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతగా పని చేసేనప్పుడే గుర్తింపు వస్తుందని తెలిపారు. వెంకటేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారని గుర్తుచేశారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మాల్యాల తిరుపతి రెడ్డి, పలిత శ్రీహరి, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాసిరి బాపురావు, జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, డీసీబీ సెక్రెటరీ రాందాస్.. వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కాయిత శ్రీనివాస్, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఎమ్మెల్యే కడియంపై ఆరోపణలు సరికాదు

వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఓ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నాడని చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులపై ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసులు, రౌడీ షీట్ పెట్టించిందే పల్లా రాజేశ్వర్ రెడ్డి అని అన్నారు. దేవునూర్ ఇనుపరాతి గుట్ట అటవీశాఖ భూముల విషయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన సవాల్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్వీకరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఏం సాధించారని రజతోత్సవ వేడుకలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యే కడియం రూ.800 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కమ్మరిపేట మాజీ సర్పంచ్ రాజమల్లయ్య, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్ రెడ్డి, గ్రామశాఖల అధ్యక్షుడు రాజు, రమేష్, స్వామి, సంపత్, శ్రీనివాస్, సంజీవరెడ్డి, ప్రశాంత్, సలీం మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సద్దాం హుస్సేన్

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల/నడికూడ: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి పరకాల వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం రాశులు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మార్కెట్‌తోపాటు పరకాల మండలం లక్ష్మీపురం గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలు, నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను గురువారం పరిశీలించారు. అకాల వర్షాలతో రైతులకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని అధికారులు అంచనావేసి నివేదిక తయారుచేయాలని తెలిపారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, తహసీల్దార్ నాగరాజు, మండల వ్యవసాయ అధికారిగా పారిక జైసింగ్, తదితరులు పాల్గొన్నారు.



పరకాల మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రైతులు అధైర్యపడొద్దు

శాయంపేట : రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో అకాల వర్షానికి నేలవాలిన వరి, అరటి, మొక్కజొన్న పంటలను ఆయన గురువారం పరిశీలించి, మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరినట్లు తెలిపారు. రైతులు ధైర్యంగా ఉండాలని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని తెలిపారు. రైతులను ప్రోత్సహించేందుకు డ్రిప్‌లు, సబ్సిడీలు, పనిముట్లు అందించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏ రకంగా రైతులకు లబ్ధి చేకూర్చారో అదే విధంగా ప్రస్తుతం రైతులకు ఫుల్ సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లతోపాటు డ్రోన్ అందిస్తామని తెలిపారు. ఈసందర్భంగా.. వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేదని రైతులు.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



శాయంపేటలో రైతులతో మాట్లాడుతున్న గండ్ర

కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

నడికూడ: మండలంలోని రాయపర్తి, ముస్త్యాలపల్లి, రామకృష్ణాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన సన్న ధాన్యం క్వింటాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ అందజేస్తుందన్నారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2,320, రెండో రకానికి రూ.2,300 మద్దతు ధర ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్, మల్లారెడ్డి, ఏపీఎం రమాదేవి, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ

శాయంపేట : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నేలవాలిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వరి, మొక్కజొన్న, అరటి పంటలు పూర్తిగా పాడైపోయాయని పేర్కొన్నారు. రైతులు అప్పుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అధికారులతో పంట నష్టాన్ని అంచనావేసి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజనను ఈ యాసంగి పంటకాలానికి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, నాయకులు ఉప్పు రాజు, కానుగుల నాగరాజు, కోమటి రాజశేఖర్, మేకల సుమన్ పాల్గొన్నారు.



అరటి తోటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ చౌరస్తా: పెండింగులో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ గజ్జల రాంకిషన్ డిమాండ్ చేశారు. హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీఓఎస్ భవన్‌లో గురువారం జరిగిన వరంగల్ జిల్లా గెజిటెడ్, ఉపాధ్యాయ, నాల్గవ తరగతి, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల సమావేశంలో నూతన జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రాంకిషన్, ప్రధాన కార్యదర్శిగా రామిరెడ్డి, కోకన్వీనర్లుగా రవీందర్‌రెడ్డి, కుమార్, డాక్టర్ ప్రకాష్, గోవిందరాజులు, మధు, కృష్ణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా వేణుగోపాల్, ఫణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గజ్జల రాంకిషన్ మాట్లాడారు.

పౌష్టికాహార లోపం అధిగమించేందుకే పోషణ పక్షం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జయంతి

- జిల్లా సంక్షేమ అధికారి జయంతి
- అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు అవగాహన

ఎల్కతుర్తి: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికార లోపం అధిగమించడమే లక్ష్యంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జయంతి తెలిపారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీడబ్ల్యూఓ జయంతి మాట్లాడుతూ.. భీమదేవరపల్లి మండల ప్రాజెక్టు పరిధిలో ఈనెల 8న ప్రారంభమైన కార్యక్రమం 22 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. గర్భిణులు, తల్లులకు పోషణ విలువలతో కూడిన సమతుల ఆహార విశిష్టత, తల్లిపాల ఆవశ్యకత, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం అందించేలా కుటుంబసభ్యులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా బలంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ సుమలత, డీసీపీఓ ప్రవీణ్‌కుమార్, సీడీపీఓ స్వరూప, మెడికల్ ఆఫీసర్లు మానిక నివేదిత, అనిత సుశీల, శిరీష, తదితర ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డంపింగ్ యార్డు

కాజీపేట: మడికొండ గ్రామ శివారులోని ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, గుడిసెవాసులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పార్టీ జిల్లా కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు